సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం : 21 : జనవరి : 2025



గర్భిణుల పడిగాపులు

ఏలూరు జీజీహెచ్‌లో అభా (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్)లో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం చేపట్టగా.. గర్భిణులు, బాలింతలు అవస్థలు పడ్డారు. 8లో ▸



రోడ్డున పడ్డ పేదలు

మోగల్లు పంచాయతీ వేండ్ర వెళ్లే రోడ్డులో ఉంటున్న కుటుంబాలను ఖాళీ చేయిస్తున్నారు. దీంతో తాము రోడ్డున పడతామని పేదలు ఆవేదన చెందుతున్నారు. 8లో ▸



విచ్చలవిడిగా నాటుసారా

మెట్ట ప్రాంతంలో సారా ఏరులై పారుతోంది. చాలా గ్రామాల్లో సారా కుటీర పరిశ్రమగా తయారైంది. దీంతో కూలీలు, కార్మికులు సారాకు బానిసలవుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

బాధితులకు భరోసాగా నిలవాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తూ వినతులు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోపు శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలువురు నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు పోలీస్ అధికారులు భరోసాగా నిలవాలని సూచించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి వివాదాలు వంటి 11 ఫిర్యాదులందాయని ఎస్పీ తెలిపారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌పై ఫిర్యాదు



జేసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తుందని మీడియాలో వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి సోమవారం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డిని కలిసి అధికారిక ఫిర్యాదు చేశారు. భీమవరంలోని ఈ స్కూల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరును దుర్వినియోగం చేస్తూ, విద్యార్థులను, తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తోందని, ఇది నిజానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ స్థాయికి చెందినది కాదని గోపిమూర్తి అన్నారు. ఇది ఢిల్లీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మాత్రమే అని, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరును వాడుకుంటూ ప్రామాణికతను అబద్ధంగా ప్రచారం చేస్తుందని జేసీకి తెలియజేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు.

ప్లాస్టిక్ రహిత జిల్లా లక్ష్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కలెక్టరేట్ నుంచే చర్యలు ప్రారంభించినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నిషేధిత థీమ్‌ను ప్రారంభించి, సమావేశానికి వచ్చిన అధికారులకు స్టీలు పాత్రల్లో మాత్రమే తాగునీరు, అల్పాహారం, టీ అందించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలను నూరుశాతం కృషిచేయాలన్నారు. జిల్లాలో మోడల్ జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి అధికారులు కంకణబద్ధులు కావాలన్నారు. తొలి విడతగా భీమవరంలో వచ్చేనెల ఒకటి నుంచి 125 మైక్రాన్‌లోపు డిస్పోజబుల్ ప్లాస్టిక్ సామగ్రిని నిషేధిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ముందుగా నోటీసులు జారీ చేయాలన్నారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్రప్రదేశ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట సర్క్యులేట్ అవుతున్న వార్తలో నిజం లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. ఉద్యోగాలకు సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే కలెక్టర్ పేరిట ప్రకటన విడుదల చేస్తామని, మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దని అన్నారు. తప్పుడు ప్రకటనల ద్వారా ప్రజలను గందరగోళ పరిస్థితులను సృష్టించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సూర్యఘర్ యోజనతో మేలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు అన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్‌లో పీఎం సూర్యఘర్ ముఫ్తి బిజిలి యోజన (సోలార్ రూఫ్‌టాప్) పథకంపై సోలార్ వెండర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యుత్ వినియోగదారులను కలిసి సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన వారికి బ్యాంకుల నుంచి రుణ సహకారం అందించాలని సూచించారు. ఎక్కువ సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి దేశంలోనే ఏలూరు జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలని కోరారు. ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేడ్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టెక్నికల్ పి.రాధాకృష్ణ, జిల్లా సోలార్ నోడల్ ఆఫీసర్ ఎ.రమాదేవి, 18 కంపెనీల సోలార్ వెండర్స్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

కొల్లేరులో మళ్లీ అలజడి

- అభయారణ్య ఆక్రమణలపై సుప్రీంకోర్టు కన్నెర్ర
- 3 నెలల్లోపు సరిహద్దులు ఖరారు చేయాలని రాష్ట్రానికి ఆదేశం
- అధికారుల ఉదాసీనతపై అసహనం
- 25న కైకలూరులో కొల్లేరు నాయకుల కీలక సమావేశం



చిత్తడి నేలల ప్రాంతమైన కొల్లేరు సరస్సు

కైకలూరు: కొల్లేరు అనే ఈ మూడక్షరాల పదం మళ్లీ తెరపైకొచ్చింది. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సహజసిద్ధ కొల్లేరు సరస్సు అభయారణ్యంలో ఆక్రమణలపై సుప్రీంకోర్టు కన్నెర్ర చేసింది. ఈనెల 16న సుప్రీంకోర్టులో జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీ జార్జ్ మసీహ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం మూడు నెలల్లోపు కొల్లేరు సరిహద్దులను గుర్తించి అక్షాంశాలు, రేఖాంశాలు ఖరారు చేయాలని, మున్సిపల్ ఘనవ్యర్థాలు, చుట్టుపక్కల పరిశ్రమలు, పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చే మురుగునీటిని ఈ సరస్సులోకి వదలకుండా అడ్డుకట్ట వేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. మత్స్యకారుల జీవనోపాధికి అడ్డంకులు కల్పించవని, రాష్ట్ర ప్రభుత్వం వారికి అవగాహన కల్పించి కోర్టు ఉత్తర్వుల అమలుకు అడ్డుతగలకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది.

2006లో కొల్లేరు ఆపరేషన్

ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన మంచినీటి సరస్సు కొల్లేరు. చేపల చెరువుల సాగు పేరుతో ఆక్రమణల వల్ల కొల్లేరు కాలుష్యంగా మారడంతో పర్యావరణ వేత్తల ఫిర్యాదులతో 1999 అక్టోబరు 4న అప్పటి ప్రభుత్వం జీఓ 120ని తీసుకొచ్చింది. దీని ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి, పూర్వ కృష్ణా జిల్లాలో 9 మండలాల్లో +5 కాంటూరు పరిధి వరకు 77,138 ఎకరాల్లో కొల్లేరు అభయారణ్యంగా గుర్తించారు. ఆక్రమణపర్వం పెరగడంతో 2006 సుప్రీం కోర్టు ఆదేశాలతో కొల్లేరు ఆపరేషన్ చేపట్టారు.

15,339 ఎకరాల్లో ఆక్రమణలు

కొల్లేరు వన్యప్రాణి అభయారణ్యంలో దాదాపు 15,339 ఎకరాల ఆక్రమిత చెరువులు ఉన్నట్టు సమాచార హక్కు చట్టం ద్వారా అటవీశాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. విస్తీర్ణం విషయానికి వస్తే ఏలూరు జిల్లాలో ఏలూరు మండలంలో 23,900, ఉంగుటూరులో 134, పెదపాడులో 789, దెందులూరులో 586, నిడమర్రులో 6,338, భీమడోలులో 20,323, కైకలూరులో 10,295, మండవల్లిలో 7,359, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలంలో 6,914 ఎకరాలు మొత్తంగా 77,138 ఎకరాల్లో అభయారణ్యం విస్తరించి ఉంది. సరస్సు 901 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించినా, అందులో 308.55 చదరపు కిలోమీటర్లు మాత్రమే వన్యప్రాణి సంరక్షణ కేంద్రం కింద నోటిఫై చేసినట్టు చెప్పారు. 6,908.48 హెక్టార్లలో ఆక్వాకల్చర్ ఉంది. గూగుల్ శాటిలైట్ చిత్రాలు కూడా ఆక్రమణలను విషయాన్ని నిర్ధారిస్తున్నాయి.

కూటమి నేతల్లో గుబులు

ఎన్నికల్లో కొల్లేరు సమస్యలను తీర్చడమే ప్రథమ అంశమని కూటమి నేతలు కొల్లేరు గ్రామాల్లో పదే పదే ప్రచారం చేశారు. అదే నమ్మిన కొల్లేరు ప్రజలు భారీగా ఓట్లు వేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో ఆ నేతల్లో గుబులు పుట్టుకుంది. వాస్తవానికి గత టీడీపీ పాలనలో ఎన్డీఏ కూటమిలో కేంద్ర మంత్రులను బీజేపీ నేతలు కొల్లేరు తీసుకొచ్చారు. అయినా కాంటూరు కుదింపు అంశం నెరవేరలేదు. ఇప్పటికే కొల్లేరు ప్రజలు ఏకో సెన్సిటీవ్ జోన్ పరిధి నుంచి భూములు కాపాడుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొల్లేరు ప్రజలకు కూటమి నేతల వాగ్దానాలు నీటి మూటలుగా మిగులుతాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అసలేం జరిగిందంటే..



కొల్లేరు మ్యాప్

గతేడాది సెప్టెంబరులో విజయవాడను ముంచెత్తిన బుడమేరు నీరు కొల్లేరులో కలిసి సముద్రానికి చేరాలి. కొల్లేరులో నీటిపారుదల లేక గ్రామాలను ముంచేత్తింది. నెల రోజులు ముంపు నీటిలో గ్రామాలు నానాయి. కొల్లేరు సంరక్షణ కోసం 2006 ఏప్రిల్ 10న సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నా ప్రభుత్వ అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కాకినాడకు చెందిన కె.మృత్యుంజయరావు గతేడాది సెప్టెంబరు 1న అప్పటి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను ప్రతివాదిగా చేరుస్తూ పిటిషన్ దాఖలు చేశాడు. ఆక్రమణల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తాజాగా ఈనెల 16న సుప్రీంకోర్టు కొల్లేరు ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వ తీరుపై కీలక వ్యాఖ్యలు చేసింది. మార్చి 14న తిరిగి ఈ కేసును విచారించనుంది.

కొల్లేరు సరస్సును కుదించండి



కొల్లేరు సరస్సును 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరు వరకు కుదించండి. కొల్లేరు ప్రజలు ఆ సరిహద్దులకు రక్షణగా నిలబడతారు. కొల్లేరుపై అవగాహన లేని ఇతర ప్రాంతాల వ్యక్తులు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేస్తున్నారు. కొల్లేరు అభయారణ్యంతో పాటు ఇక్కడ ప్రజలు జీవనోపాధిని దృష్టిలో పెట్టుకోవాలి. ఈనెల 25న కైకలూరులో కొల్లేరు సంఘం ఆధ్వర్యంలో భారీ సమావేశం నిర్వహించనున్నాం. కొల్లేరు ప్రాంతవాసులు తరలిరండి.

– భలే ఏసురాజు, రాష్ట్ర వడ్డీ సాధికారత కన్వీనర్, కొట్టాడ, కైకలూరు మండలం

డ్రెయినేజీ సమస్యకు మోక్షం



డ్రెయినేజీ నీటి తొలగింపు పనులు

సాక్షి స్పందన

ఆకివీడు: ఆకివీడు పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రెయిన్లు అధ్వానంగా ఉండటంపై 'పండుగ రోజుల్లో మురుగునీటి సరఫరా' శీర్షికను 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ స్పందించారు. జాతీయ రహదారిపై స్థానిక ఐబీపీ పెట్రోల్ బంక్ వద్ద డ్రెయినేజీ అధ్వానంగా ఉండటంతో అపార్ట్‌మెంట్లలోని మురుగునీరు రోడ్లపైకి వచ్చి వర్షం నీటిని తలపిస్తోంది. సోమవారం స్థానిక ఐబీపీ పెట్రోల్ బంకు ప్రాంతాలను కమిషనర్ కృష్ణమోహన్ పరిశీలించి మురుగునీరు ప్రవాహానికి అడ్డుగా ఉన్న డ్రెయిన్లపై ప్లేట్లను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే డ్రెయినేజీలో మురుగునీరు, సిల్టులు తొలగించారు. దీంతో సమస్య కొంతవరకు పరిష్కారమైందని, శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు గొట్టుముక్కల జానకీరామరాజు, కొప్పర్తి రవికుమార్ కోరారు. హైస్కూల్ నుంచి మూలలంక కాల్వ వరకూ డ్రెయిన్ నిర్మించేందుకు అధికారులు అంగీకరించినట్టు తెలిసింది. నాయకులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, మోటుపల్లి ప్రసాద్ తదితరులు ఇక్కడకు చేరుకుని సమస్యను కొలిక్కి తీసుకువచ్చారు.

సుగర్ వ్యాధిపై అవగాహన అవసరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: యూకే–ఇండియా డయాబెటిక్ ఫుట్ ఫౌండేషన్, మాజీ కేంద్ర మంత్రి కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి ఆధ్వర్యంలో సోమవారం భీమవరంలో నిర్వహించిన ఉచిత మెగా సుగర్ వ్యాధి చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక డీఎన్నార్ స్కూల్ ఆవరణలో ఏర్పాటుచేసిన శిబిరానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 1,800 మంది రోగులు వచ్చారు. శిబిరాన్ని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించి మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, సరైన వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో డయాబెటిస్ కేసులు పెరిగిపోతున్నాయని, వ్యాధిపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. వైద్య శిబిరంలో 30 మంది స్పెషలిస్ట్ వైద్యులు సేవలందించారు. రోగులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు (ఉంగుటూరు), రమణరెడ్డి (తెలంగాణ), విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, లండన్‌కు చెందిన డాక్టర్ కె.వేణు, డాక్టర్ పీఆర్‌కే వర్మ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజుసూరి, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు, గోకరాజు పాండురంగరాజు, జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఉండి వాసు తదితరులు పాల్గొన్నారు.


గళమెత్తిన సహకార ఉద్యోగులు



భీమవరంలో కలెక్టరేట్ వద్ద సహకార ఉద్యోగుల ధర్నాకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి తమ సమస్యలు పరిష్కరించాలని గళమెత్తారు. రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ సహకార ఉద్యోగులు తక్కువ జీతాలతో ఇబ్బంది పడుతున్నారని, శిక్షణ ఇవ్వకుండా కంప్యూటరీకరణ చేయించడం, ఈఆర్పీ అమలుతో ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఉద్యోగులు న్యాయమైన 16 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా నాడు చంద్రబాబు ఇచ్చిన జీఓ 36ను ఇప్పుడు ఆయనే సీఎంగా ఉన్నారు కాబట్టి అమలు చేయాలని కోరారు. ధర్నాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి పాల్గొని మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా సహ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు వేగేశ్న ప్రకాష్‌వర్మ తదితరులు మాట్లాడారు.

అంతరిస్తున్న కళలను ఆదరిద్దాం



మాయాబజార్ నాటక ప్రదర్శన

ఉండి: అంతరించిపోతున్న కళలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, కోలమూరు సర్పంచ్ నడింపల్లి రామకృష్ణంరాజు అన్నారు. మండలంలోని కోలమూరులో సంతానగోపాలస్వామి ఆలయ ఆధ్వర్యంలో టీటీడీ, విశ్వహిందూపరిషత్ సౌజన్యంతో సురభి (హైదరాబాద్) నాటకోత్సవాలను సోమవారం రాత్రి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతరించిపోతున్న కళల్లో నాటకరంగం ఒకటని అన్నారు. సాంకేతికత విస్తరించడంతో నాటకరంగం వెనుకబడిపోయిందని అన్నారు. దీంతో ఎందరో కళాకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాటకాలను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే నాటకోత్సవాలను గ్రామ ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల్లోని కళాకారులు, నాటకరంగ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై వీక్షించాలని కోరారు. అభిమానులు నాటకరంగానికి జీవం పోసేలా జాతరలు, పండుగ సమయాల్లో నాటక ప్రదర్శనలు ఏర్పాటుచేయాలని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరాజు,ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుక మీద బ్రహ్మాస్త్రాలా.. ఆరిమిల్లీ!

- ఆటో డ్రైవర్ దుర్గారావుపై నీ ప్రవర్తన దుర్మార్గం
- జగన్ బొమ్మ వేసుకుంటే నీకొచ్చిన నష్టమేంటి?
- మాజీ మంత్రి కారుమూరి ఆగ్రహం



తణుకులో ఎమ్మెల్యే రాధాకృష్ణ కారు సీసీ టీవీ పుటేజీని చూపిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: సామాన్యుడైన ఆటోడ్రైవర్‌ను కూడా వెంటాడి వేధించే సంస్కృతిని తణుకు ప్రజలకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పరిచయం చేస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెరవలి మండలం కానూరుకి చెందిన వైఎస్ జగన్ అభిమాని పంజా దుర్గారావు తన ఆటోపై వైఎస్ జగన్ బొమ్మ వేసుకోవడం చూసి ఆరిమిల్లి రాధాకృష్ణ ఓర్వలేకపోయారన్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ కారుకు దారి ఇచ్చినా వెళ్లకుండా ఆటోను వెంటాడి బూతు పురాణంతో వేధించి అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గపు చర్యని స్పష్టం చేశారు. దీనికి గాను రివర్స్‌గా దుర్గారావుపై అక్రమ కేసు పెట్టించే స్థాయికి ఎమ్మెల్యే దిగజారిపోయాడని ఎద్దేవా చేశారు. ఆటో వెనుక నీ కారు ఎంత దూరం ప్రయాణించింది.. ఎలా ప్రయాణించింది.. అనే విషయాలకు సంబంధించిన సీసీ టీవీ పుటేజీలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. వాటిని బహిర్గతం చేస్తే ఎమ్మెల్యే రాధాకృష్ణ రంగు బయటపడుతుందని, అయితే అది తన సంస్కృతి కాదన్నారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రాలు సంధించి నీ పైశాచికానందాన్ని తీర్చుకున్నావంటూ కారుమూరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

తణుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తణుకులో సామాన్యులంతా అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి కారుమూరి సూచించారు. ఎమ్మెల్యేకి అడ్డం వచ్చినా, ఎదిరించినా దాడులకు దిగే సంస్కృతిని తీసుకువస్తున్నారన్నారు. రిలయన్స్ మాల్ ప్రాంతంలో ఆటోకి ఎమ్మెల్యే కారును అడ్డుపెట్టిన వైనాన్ని సీసీ టీవీ పుటేజీలో చూపించారు. దీనిపై ఆటో డ్రైవర్ దుర్గారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాధాకృష్ణ తన ఆటోను వెంబడించారని, పక్కకి తీసి ఆపినా తన ఆటో వెనుకే ఆపారని చెప్పారు. చివరకు తన ఆటోకు ఎమ్మెల్యే కారును అడ్డుపెట్టి 'పంజా దుర్గారావు అంటే నువ్వేనా' అని అడిగి తనను ఇష్టానుసారంగా బూతులు తిట్టారని, తన తల్లిని కూడా బూతులు తిట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నా తల్లి ఎంతో మీ తల్లి కూడా అంతేనని అన్నానే కానీ.. తాను మరేదీ అనలేదని దుర్గారావు చెప్పారు. ఈ విషయంపై ఏ ఆలయానికి వచ్చి అయినా ప్రమాణం చేస్తానని, మీరు ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు.

పశువధ శాల మూయించాల్సిందే..

లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తేతలిలో నిర్వహిస్తున్న పశువధ శాలకు అనుమతులు అక్రమమని, అయినా పశువధ శాల నడుస్తోందంటే దానికి ఎమ్మెల్యేనే బాధ్యత వహించాలని మాజీ మంత్రి కారుమూరి అన్నారు. దీనిపై కలెక్టర్ ఒక వారంలో విచారణ చేయించి నివేదిక ఇస్తామని చెప్పారని, వేచి చూస్తున్నామన్నారు. తణుకుకు పట్టిన ఈ దరిద్రాన్ని ఆపకపోతే రాబోయే రోజుల్లో శాంతియుత పాదయాత్రకు దిగనున్నామని హెచ్చరించారు. పెరవలి ఎంపీపీ కాచ్చెర్ల ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, వీరమల్లు ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల వెల్లువ



భీమవరం కలెక్టరేట్‌లో మీకోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలోని పలుప్రాంతాల నుంచి అర్జీదారులు 194 వినతులు సమర్పించారు. అర్జీలపై సత్వర పరిష్కారం ఉండాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. అర్జీలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అర్జీలు రీఓపెనింగ్ లేకుండా చూడాలన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ కేసీసిహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

కులగణనకు సమయం పొడిగించాలి



ఎస్సీ, ఎస్టీ కులగణన అభ్యంతరాలకు సమయం పొడిగించాలని కేవీపీఎస్ జిల్లా బృందంతో కలిసి మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో చాలామంది దళితరులకు కులగణనపై సరైన సమాచారం లేదని, సర్వేలో లోటుపాట్లు ఉన్నాయని వాటిని సరిచేయడానికి, అభ్యంతరాలకు గడువు పొడిగించాలని కోరారు.

నెలరోజులుగా అంధకారంలో..



కాళ్ల గ్రామంలోని లంకరోడ్డులోని 30 కుటుంబాలపై అధికారులు కక్ష కట్టారని, నెల రోజులుగా తమ ఇళ్లకు కరెంట్ పీకేశారని పలువురు బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమ ఇళ్లు తొలగిస్తామని భయపెడుతూ ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేశారని, చిన్నపిల్లలతో చీకట్లలో కాలం గడుపుతున్నామని వాపోయారు. న్యాయం చేయాలని కోరారు.

భూముల సమస్యలు పరిష్కరించాలని..



పెనుగొండ మండలం దొంగరావిపాలెంలో 13 ఎకరాల జిరాయితీ భూమి నిషేధిత భూముల జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్ సమస్యలు వస్తున్నాయని 13 మంది రైతులు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఏడాది కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోయారు. తమ భూముల సమస్య పరిష్కరించాలని రైతులు కోరారు.

25న జాబ్‌మేళా

భీమవరం (ప్రకాశంచౌక్): పాలకొల్లు బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ చాంబర్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న ఉద్యోగ దిక్సూచి (మెగా జాబ్‌మేళా) నిర్వహించనున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. నిరుద్యోగయుతకు 20 కంపెనీల్లో 610 ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నారని, మరిన్ని వివరాలకు సెల్ 95020 24665, 94418 41622, 70148 96277 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

యోగాసన పోటీల్లో గోల్డ్ మెడల్



బంగారు పతకం సాధించిన ఇంజుమూరి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పతాంజలి యోగాలయం యెగాచార్యుడు ఇంజుమూరి మాధవరావు 75 ఆపై ఏజ్ గ్రూపులో ఫ్లేస్ గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ సాధించారు. తమిళనాడు గవర్నమెంట్ స్పోర్ట్స్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో చెన్నై మహాత్మాగాంధీ ఆడిటోరియంలో యోగాసన పోటీలు ఇటీవల జరిగాయి. ఇంజుమూరి గోల్డ్ మెడల్ సాధించగా యెగా నిర్వాహకులు, సభ్యులు అభినందించారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



మృతుడు వీరాంజనేయులు

నూజివీడు: సెంట్రింగ్ పెడుతుండగా కరెంటు తీగలు తగిలి ఒక వ్యక్తి అక్కడికక్కడే వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని బత్తులవారిగూడెంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుగులోతు శ్రీను ఇల్లు నిర్మించుకుంటున్నాడు. మండలంలోని సుంకొల్లుకు చెందిన గోళ్ల వెంకట వీరాంజనేయులు(28) ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూనే, డ్యూటీ లేని సమయంలో సెంట్రింగ్ పనులకు వెళ్లేవాడు. సెంట్రింగ్ పనికి వెళ్లి అక్కడ పనిచేస్తుండగా పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్లు తగిలి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం: గూడెం నుంచి విశాఖ వైపు వెళ్తున్న రైలు ఢీకొనడం వల్ల సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే ఎస్సై పి.అప్పారావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు బనియన్, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిస్తే 94906 17090, 99480 10061 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బాలికపై లైంగిక దాడి.. బాలుడిపై పోక్సో కేసు

ద్వారకాతిరుమల: బాలికపై అత్యాచారం చేసిన బాలుడిపై సోమవారం పోక్సో కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని దొరసానిపాడుకు చెందిన బాలిక, జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురంకు చెందిన బాలుడు జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ప్రేమ పేరుతో సదరు బాలుడు ఏడాది నుంచి బాలిక వెంట పడుతున్నాడు. కళాశాలకు వెళ్లే బస్సులో ఆమె వెంటపడేవాడు. మాయమాటలు చెప్పి ఆమెను మోసగించాడు. బాధిత బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మెట్టలో విచ్చలవిడిగా నాటుసారా

- కుటీర పరిశ్రమగా సారా తయారీ
- యథేచ్ఛగా నల్లబెల్లం అమ్మకాలు

చింతలపూడి : మెట్ట ప్రాంతంలో నాటు సారా ఏరులై పారుతోంది. చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని అనేక గ్రామాల్లో నాటు సారా కుటీర పరిశ్రమగా తయారైంది. దీంతో రోజంతా కాయకష్టం చేసి సంపాదించుకున్న సొమ్మును కూలీలు, కార్మికులు, కర్షకులు .. ఇలా అందరూ సారా మహమ్మారికి బానిసలవుతున్నారు. చుక్కేస్తే గానీ కిక్కు రాదని, ఆ కిక్కులో తమ కష్టాలన్నీ మరిచిపోవచ్చని ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. వీరి బలహీనతే సారా వ్యాపారులకు ఆదాయ వనరుగా మారింది.

ఈ నాటు సారా తయారీలో ఉపయోగించే ముడి పదార్థాలు మోతాదుకు మించి కలపడం వల్ల తాగిన వారు ఆసుపత్రుల పాలవుతున్నారు .ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి ఒకటి, రెండు లీటర్లు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. అయితే దొడ్డిదారిన భారీగా నాటు సారా అమ్మకాలు సాగుతున్నాయి. ఏలూరు జిల్లాలోనే కాకుండా కృష్ణా, ఖమ్మం జిల్లాలకు కూడ ఇక్కడి నుంచి రోజుకు వందలాది లీటర్ల సారా తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు ఎన్నిసార్లు దాడులు చేసి కేసులు నమోదు చేసినా బెయిల్‌పై వచ్చి మళ్లీ సారా తయారీలో నిమగ్నమవుతున్నారు. గత ఆరు నెలల్లో 18 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, 314 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.



చింతలపూడి పట్టణంలో బెల్లం దుకాణాలు తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)



దాడుల్లో ధ్వంసం చేస్తున్న బెల్లపు ఊట

విచ్చల విడిగా నల్లబెల్లం విక్రయాలు

సారా తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం అమ్మకాలు చింతలపూడి పట్టణంలో విచ్చలవిడిగా జరుగుతున్నాయి. స్థానికంగా ఉన్న కొంతమంది బెల్లం వ్యాపారులు సిండికేట్‌గా మారి టన్నుల కొద్దీ బెల్లాన్ని చిత్తూరు జిల్లా నుంచి దిగుమతి చేసి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. సారా తయారీకే ఈ బెల్లాన్ని వినియోగిస్తారని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు నామమాత్రపు దాడులు జరుపుతూ, మరోవైపు బెల్లం వ్యాపారులకు కొమ్ముకాస్తున్నట్లు ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఇటీవల అధికారులు బెల్లం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులు కూడ నిబంధనలను అడ్డు పెట్టుకుని కేసుల నుంచి తప్పించుకుంటున్నారు. చింతలపూడి మార్కెట్‌కు లారీల్లో టన్నుల కొద్దీ బెల్లం వస్తుందనేది బహిరంగ రహస్యం. ఈ బెల్లం మొత్తం సారా తయారీకే వినియోగిస్తున్న మాట కూడా సత్యం . ఉన్నతాధికారులు బెల్లం గొడౌన్లపై దాడులు చేసి వ్యాపారులను కట్టడి చేస్తే సారా తయారీని అరికట్టవచ్చు.

కఠిన చర్యలు తీసుకోవాలి



నియోజకవర్గంలో విచ్చల విడిగా బెల్లం అమ్మకాలు సాగిస్తున్న వ్యాపారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. బెల్లం వ్యాపారులతో సంబంధిత అధికారులు కుమ్మక్కు అవడంతో సారాను అరికట్ట లేకపోతున్నారు. బెల్లం అమ్మకాలను నియంత్రిస్తే సారా తయారీని నిర్మూలించవచ్చు.

తొర్లపాటి బాబు – సీపీఐ మండల సహాయ కార్యదర్శి

పేరంటపల్లిలో ఎస్టీ కమిటీ చైర్మన్ పర్యటన



పేరంటపల్లిలో పర్యటిస్తున్న ఎస్టీ కమిటీ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు

వేలేరుపాడు : వేలేరుపాడు మండలంలో పర్యాటక కేంద్రమైన పేరంటపల్లిలో సోమవారం రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా టూరిజం శాఖకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలవరం ముంపులో ఉన్న పేరంటపల్లి గ్రామంలో భూముల సర్వే ఇంకా చేయాల్సి ఉన్నా అధికారులెవరూ పట్టించుకోవడంలేదని ఆ గ్రామ కొండరెడ్లు ఎస్టీ కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్ళారు. తమ గ్రామం 45 కాంటూర్ లెవల్ జాబితాలో ఉందని, 41 కాంటూర్‌లో చేర్చాలని కోరారు. జీలుగుమిల్లి మండలంలో పునరావాస కాలనీలు నిర్మించాలని కోరారు. స్పందించిన ఎస్టీ కమిటీ చైర్మన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శంకర్‌నాయక్, కొర్రా రామలక్ష్మి, లిల్లి సురేష్, టూరిజం శాఖ డీఎం పట్టాభిరాం, వేలేరుపాడు తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పశువధ శాలకు వెళ్తున్న వ్యాన్ల అడ్డగింత



తేతలిలో గోసేవా సమితి సభ్యులు అడ్డుకున్న 10 గేదెలు ఉన్న రెండు వ్యాన్లు

తణుకు అర్బన్ : తణుకు మండలం తేతలిలోని లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు గేదెలు తీసుకువెళ్తున్న రెండు వ్యాన్‌లను సోమవారం గోసేవా సమితి సభ్యులు అడ్డుకున్నారు. అనుమతులు లేని పశువధ శాలకు అక్రమ మార్గంలో రెండు వ్యాన్‌లలో తరలిస్తున్న గేదెలను నిలుపుదలచేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. పశువధ శాలకు కొద్దిదూరంలో అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇవ్వగా రూరల్ ఎస్సై చంద్రశేఖర్ రెండు వ్యాన్‌లను రవాణా కార్యాలయానికి తరలించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు వ్యాన్‌ల రికార్డులు పరిశీలించి ఒక వ్యాన్‌లో ఒక గేదెను మాత్రమే తరలించాలని, ఒక దానిలో 6, మరో వ్యాన్‌లో 4 గేదెలు తరలిస్తున్న వ్యాన్‌లను సీజ్‌చేసి రూరల్ పోలీసులకు అప్పగిస్తున్నట్లు చెప్పారు. రెండు వ్యాన్‌లపై జరిమానా వేసి గేదెలను రోడ్డుపై వదిలేశారని గోసేవా సమితి సభ్యుడు శ్రీనివాస్ ఆరోపించారు. అధికారుల తీరు లాహం సంస్థకు అనుకూలంగానే ఉందని విమర్శించారు.

మట్టి ట్రాక్టర్ల స్వాధీనం



కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న మట్టి ట్రాక్టర్లు

కొయ్యలగూడెం: సాగునీటి చెరువుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. పరింపూడి, దిప్పకాయలపాడు రెవెన్యూ పరిధిలోని సాగునీటి చెరువుల నుంచి మట్టిని ట్రక్కుల్లో తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేశామన్నారు. పోలీసుల వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న జేసీబీ నిర్వాహకులు తప్పించుకున్నారు. మట్టిని రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గుర్తించి స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రాజవరం, యర్రంపేట గ్రామాల సరిహద్దులో ఉన్న పొలపాకులు చెరువు నుంచి నెల రోజులుగా రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా మట్టి రవాణా సాగుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇరిగేషన్ రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆరు వందల టిప్పర్ల మట్టి తోలకాలకు జేసీబీ నిర్వాహకులు ఒప్పందం కుదుర్చుకున్నారని రైతులు ఆరోపించారు. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గర్భిణుల పడిగాపులు

ఏలూరు జీజీహెచ్‌లో గర్భిణులు, బాలింతల అవస్థలు ఇవి. జీజీహెచ్‌లో తల్లి– బిడ్డ ప్రత్యేక వార్డులో గర్భిణులు, బాలింతలకు చికిత్స అందిస్తారు. సాధారణంగా ఓపీ తీసుకుని సంబంధిత డాక్టర్ దగ్గరకు వెళ్లి చికిత్స పొందాలి. ప్రస్తుతం అభా (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్)లో ఆన్‌లైన్‌లో నమోదు కార్యక్రమం చేపట్టారు. దీంతో గర్భిణులు ఆన్‌లైన్ కౌంటర్ వద్ద గంటల తరబడి నిలబడలేక నానా అవస్థలు పడుతున్నారు. అభా యాప్ సరిగా పనిచేయక ఒక వ్యక్తికి ఆన్‌లైన్ చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటోంది. దీంతో గర్భిణులు, బాలింతలు తమ వంతు వచ్చే వరకు పడిగాపులు పడుతున్నారు. ఆ తర్వాత డాక్టర్ వద్ద పడిగాపులు. ప్రభుత్వాసుపత్రికి రావాలంటే భయపడే పరిస్థితి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



అభా కౌంటర్ వద్ద గర్భిణుల పడిగాపులు



ఏలూరు జీజీహెచ్‌లో తల్లి-బిడ్డ వార్డులో ఓపీ కోసం నిరీక్షణ





వైద్యం కోసం పడిగాపులు

వ్యక్తిపై హత్యాయత్నం



తీవ్రంగా గాయపడిన బొడ్డి కృష్ణ

గణపవరం : గణపవరం మండలం ముగ్గుళ్ల గ్రామ శివారున వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామానికి చెందిన బొడ్డి కృష్ణను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బలవంతంగా ముగ్గుళ్ల వద్దకు తీసుకొచ్చి చాకుతో గొంతు కోసి పారిపోయారు. అటుగా వెళ్తున్నవారు 108కు ఫోన్ చేయగా 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కృష్ణ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా గణపవరం ఎస్‌ఐ మణికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియుడి ఇంటి ముందు ధర్నా

బుట్టాయగూడెం: ప్రియుడు మోసం చేశాడని ఒక యువతి అతని ఇంటి ముందు సోమవారం ధర్నాకు దిగింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం బుట్టాయగూడెంకు చెందిన యువకుడు, తాను రెండేళ్లుగా ప్రేమించుకున్నామని చెప్పింది. తనకు 18 ఏళ్లు నిండాక పెళ్లి చేసుకుంటానని నమ్మించి గత ఏడాది ఇంటి నుంచి తీసుకువెళ్ళి విజయవాడలో ఒక ప్రైవేటు రూమ్‌లో ఉంచాడని చెప్పింది. తాను, తన ప్రియుడు సహజీవనం చేశామని పెళ్లి చేసుకోమని అడుగుతుంటే ఒప్పుకోవడంలేదని ఆ యువతి పేర్కొంది. తనకు న్యాయం చేయాలని ప్రియుడి ఇంటి ముందు ధర్నాకు దిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆ యువతిని అక్కడి నుంచి స్టేషన్‌కు తీసుకెళ్ళారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై సోమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలు ఢీ.. 8 మందికి గాయాలు

దెందులూరు : వీరభద్రపురం గ్రామంలో సోమవారం సాయంత్రం ఆటోను వెనుక నుంచి మరో ఆటో ఢీకొట్టడంతో రెండు ఆటోలు తిరగబడ్డాయి. ఢీ కొట్టిన ఆటోలో ఉన్న ఎనిమిది మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే 108లో ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



దెందులూరు మండలం వీరభద్రపురంలో తిరగబడిన ఆటో

పొట్ట కూటికి వెళ్లి అనంత లోకాలకు



తలారి సుకుమార్

ఆకివీడు : ఆకివీడుకు చెందిన లారీ డ్రైవర్ తలారి సుకుమార్‌ను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పెట్రోల్ నింపుకునేందుకు ఆయిల్ ట్యాంకర్‌ను రాజమండ్రిలో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్ యార్డుకు తీసుకువెళ్లిన సుకుమార్(36)ను సోమవారం ఉదయం మరో లారీ వెనక నుంచి ఢీకొంది. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న సుకుమార్ మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అమృతరావు కాలనీ శ్మశాన వాటిక ప్రాంతంలో నివసిస్తున్న వారి కుటుంబాన్ని ఇటీవల ఖాళీ చేయించారు. అద్దె ఇంటిలో ఉంటున్న ఆ కుటుంబం జీవనాధారాన్ని కోల్పోయింది. సుకుమార్ కుమారుడు మానసిక దివ్యాంగుడు. వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ సభ్యుడిగా ఉన్న సుకుమార్ పార్టీకి అంకిత భావంతో పనిచేసేవారని, మంచి కార్యకర్తను కోల్పోయామని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

రోడ్డున పడ్డ పేదల బతుకులు



మోగల్లులో ఇల్లు కూల్చి వేస్తున్న దృశ్యం



కూల్చివేసిన ఇల్లు

పాలకోడేరు: ఉండి నియోజకవర్గం పాలకోడేరు మండలం మోగల్లు పంచాయతీ వేండ్ర వెళ్లే రోడ్డులో ఉంటున్న కుటుంబాలను ఖాళీ చేయిస్తున్నారు. వీరంతా గత నలభై ఏళ్లుగా ఆర్ అండ్ బీ పరిధిలో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. గత సోమవారం నుంచి వీరి ఇళ్లను జేసీబీతో కూల్చివేస్తున్నారు. నోటీసులు ఇచ్చామని అయినా ఖాళీ చేయలేని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. తెలుగుదేశానికి చెందిన ప్రజాప్రతినిధి ఆక్రమణలు తొలగించమని ఆదేశాలిచ్చినట్లు తెలిసిందని బాధితులు వాపోతున్నారు. తామంతా రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలమని, అర్థాంతరంగా ఇళ్లు కూల్చి వేస్తే ఎక్కడ తల దాచుకోవాలని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమకు వేరే చోట స్థలాలు ఇచ్చి కట్టుకున్న తర్వాత ఖాళీ చేయించాలని వేడుకుంటున్నారు.

పాఠశాలలో కంప్యూటర్ ధ్వంసం

నూజివీడు: సంక్రాంతి సెలవుల సమయంలో మండలంలోని పోతురెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆకతాయిలు కొందరు బీభత్సం చేశారు. సంక్రాంతి సెలవుల అనంతరం సోమవారం స్కూల్ తలుపులు తీయడంతో వితరణగా ఇచ్చిన కంప్యూటర్ మానిటర్ ధ్వంసం చేసి ఉంది. దీంతో పాఠశాలలోని కంప్యూటర్ గదిని పరిశీలించగా గది తలుపునకు వేసిన తాళాలు పగలగొట్టి గదిలో ఉన్న కంప్యూటర్లను బయటికి తీసుకొచ్చి ధ్వంసం చేశారు. పాఠశాలలోని విద్యార్థుల మంచినీటి కోసం వాడే పైపులైను ట్యాపులను సైతం విరగ్గొట్టినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.జయమణి పేర్కొన్నారు. ఈ సంఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



జువ్వనపూడి విక్రమ్ (ఫైల్)

ముసునూరు: మండలానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో రోడ్డ ప్రమాదంలో మరణించడంతో స్వగ్రామం చిల్లబోయినపల్లిలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన జువ్వనపూడి విజయరాజు కుమారుడు విక్రమ్(25) హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఇటీవల జాబ్ సంపాదించాడు. సోమవారం ఉదయం బైక్‌పై వెళుతుండగా వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. కుమారుడి మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించు కోలేకపోతున్నారు.

గోవుల అక్రమ రవాణాపై కేసు నమోదు

భీమడోలు : గోవులను అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిపై భీమడోలు పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా కె.కోటపాడు గ్రామానికి చెందిన సర్వశుద్ధి దివాకర్ వ్యాన్‌లో 15 గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నాడు. పోలీసులు సూరప్పగూడెం జాతీయ రహదారిపై తనిఖీలు చేశారు. గోవులను తిమ్మనవీడులోని గోసంరక్షణ కేంద్రానికి తరలించారు. దివాకర్, డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

30న గుంటూరులో పారా అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 30న గుంటూరులో పారా అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9390131777, 9652458901, 9182877433 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

రావిపాడులో గుండె వైద్య శిబిరం

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో మంగళవారం ఉదయం గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన వైవీరావు గుండె ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఈ శిబిరం స్థానిక కృష్ణుడి గుడి వద్ద జరుగుతుందన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుగర్, బీపీ లక్షణాలు, గుండె సంబంధించిన సమస్యలతో ఇబ్బందులు పడేవారికి ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు.

చింతకాయలకు పీటీ ఉష సత్కారం


చింతకాయలను సత్కరిస్తున్న పీటీ ఉష

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ స్పోర్ట్స్ అకాడమీకి ఎక్కువ మంది క్రీడాకారులను ఎంపిక చేసి, శిక్షణ ఇప్పిస్తున్న తాడేపల్లిగూడెం మునిసిపల్ వ్యాయామ ఉపాధ్యాయుడు చింతకాయల సత్యనారాయణను ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్, భారత క్రీడా సంస్థ చైర్మన్ పీటీ ఉష విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. స్పోర్ట్స్ కోటాలో ఎంతో మందికి ఉపాధిని కల్పించడానికి, మంచి క్రీడాకారులుగా విద్యార్థులు తీర్చిదిద్దిన చింతకాయల సత్యనారాయణ కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, పీఈటీలు, తదితరులు సత్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆరు ఫిర్యాదులు అందాయి. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రెండు, పబ్లిక్ హెల్త్ విభాగానికి చెందిన ఒక ఫిర్యాదు, పట్టణ ప్రణాళికావిభాగానికి సంబంధించి మూడు ఫిర్యాదులు అందాయి. కమిషనర్ ఎం.ఏసుబాబు , అధికారులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని యాగర్లపల్లిలో బెల్ట్‌దుకాణం నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని సోమవారం గూడెం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని దగ్గర నుంచి ఏడు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి, ఎస్ఐలు మురళీ మోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదేవి మహంకాళి ఆలయ మహోత్సవాలు


రుద్ర హోమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీదేవి మహంకాళి అమ్మవారి 45వ వార్షికోత్సవంలో భాగంగా 8వ రోజు నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు ఆధ్వర్యంలో సోమవారం అనుముల ఫణి శంకర్ బ్రహ్మత్వంలో లక్ష్మీ గణపతి, లలితా సహస్ర నామాలు, దుర్గా సప్త శతి, సుదర్శన, మహాకాళి శ్రీ సూక్తం, శ్రీ రుద్ర హోమం అత్యంత వైభవంగా జరిగాయి. ఆయల కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

22న మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

భీమవరం: వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ నిర్వహించనున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. భీమవరంలోని శ్రీరాంపురంలో గాంధీ కస్తూరిబా భవనంలో 22వ తేదీ నుంచి కుట్టు, ఎంబ్రాయిడరీ, శారీ పెయింటింగ్స్‌పై శిక్షణ ఇస్తారని ఆసక్తి గల మహిళలు సెల్ నంబర్ 86397 30222కు సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు 4 నెలలుగా జీతాల్లేవ్

- కూటమి ప్రభుత్వంలో అల్లాడుతున్న కాంట్రాక్ట్ కార్మికులు
- అప్పులుచేసి రోజులు గడుపుతున్న వైనం
- నిరసనలు తెలుపుతున్నా పట్టించుకోని దుస్థితి


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద నినాదాలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)


ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న పారిశుద్ధ్య కార్మికులు(ఫైల్)

తణుకు అర్బన్: సర్కారు దవాఖానాల్లో విధుల్లో ఉన్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలులేక అల్లాడుతున్నారు. అసలే అంతంతమాత్రం వేతనమని అది కూడా 4 నెలలుగా పెండింగ్ పెట్టారంటూ గగ్గోలు పెడుతున్నారు. వేతనాలు అందకపోవడంతో అప్పుచేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మొత్తం 19 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉన్నారు.

క్లిష్టమైన పారిశుద్ధ్యం..

పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి ఆవరణతో పాటు వార్డులు, మరుగుదొడ్లు, ఆపరేషన్ థియేటర్ వంటి విభాగాల్లో నిత్యం తుడవడమే కాకుండా తడిబట్టతో శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఆస్పత్రి సామర్థ్యం పెరిగినా అదే సిబ్బందితో నెట్టుకొస్తున్న పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. పనిపెరిగినా కష్టపడి పనిచేస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్మికులు సేవలందిస్తున్నారు. ఆపరేషన్ థియేటర్‌లో వచ్చే వ్యర్థాలతో పాటు వివిధ వార్డుల్లో వచ్చే వ్యర్థాలను తొలగించడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలకంగా పనిచేస్తుంటారు. రక్తపు వ్యర్థాల తొలగింపులో రోగాలబారిన పడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లోనే విధుల్లో ఉండాల్సి వస్తుందని అయినప్పటికీ ఏ నెల వేతనం ఆనెల ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో కార్మికులపై నిర్లక్ష్యం..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వేతనాలు సక్రమంగా రాకపోవడం తీవ్ర దుమారాన్ని రేపుతుంది. కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో పలు సందర్భాల్లో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితులు కనిపించడంలేదని నాయకులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వేతనాలు పెంచగా ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేతనగండం నెలకొందని వాపోతున్నారు. అంతేకాకుండా కార్మికులకు సంబంధించిన పీఎఫ్ కూడా తమ బ్యాంకు ఖాతాలకు జమకావడం లేదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులు ఎలా బతకాలి..



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ వేతనానికి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ వేతనం కూడా ఏనెల వేతనం ఆనెలలో ఇవ్వకుండా ఇప్పటికి 4 నెలలు పెండింగ్ ఉంచడం చాలా దారుణం. వేతనం ఇవ్వకపోతే వారు ఇళ్లు ఎలా గడుపుకోవాలి. అప్పులు చేసి వడ్డీలు కట్టాల్సిన పరిస్థితుల్లో కార్మికులు ఉన్నారు. తమ విధి నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు తణుకు ఆస్పత్రికి ఎన్నో అవార్డులు తెచ్చిపెట్టాయి. అటువంటి కార్మికులను నిర్లక్ష్యం చేయడం చాలా దారుణం.

– కోనాల భీమారావు, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు

కుష్టు వ్యాధి కేసులపై సర్వే


కృష్ణాయపాలెం గ్రామంలో కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: కుష్టు వ్యాధి అనుమానిత కేసుల గుర్తింపు సర్వేని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీ.వెంకటేష్ తెలిపారు. సోమవారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధి కృష్ణాయపాలెం గ్రామంలో జరుగుతున్న సర్వేను ఎంపీడీవో ఎం. విశ్వనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చర్మంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలు, కాళ్ల నుంచి చెప్పులు జారిపోవడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించడం ద్వారా కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ కే.రవికుమార్, డాక్టర్ రవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

అత్తిలి: మండలంలో గల అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు మొబైల్ ఆధార్‌క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి శామ్యూల్ సోమవారం తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు పిల్లలకు ఈమొబైల్ ఆధార్ క్యాంపుల్లో ఆధార్ నమోదు చేయించాలని చెప్పారు. ఈనెల 21న కె సముద్రపుగట్టు, మంచిలి, తిరుపతిపురం, 22న పాలి, మంచిలి, తిరుపతిపురం, 23న అత్తిలి–3, ఆరవల్లి, బల్లిపాడు, 24న గుమ్మంపాడు గ్రామ సచివాలయం వద్ద ఆధార్ నమోదు కేంద్రాలు జరుగుతాయన్నారు. ఈనెల 27న పాలూరు, దంతుపల్లి, వరిఘేడు, 28న కొమ్మర, ఉనికిలి, వరిఘేడు, 29న ఈడూరు, ఎల్ఎస్‌పురం, ఉరదాళ్ల పాలెం, 30న కంచుమర్రు, స్కిన్నెరపురం, ఉరదాళ్ల పాలెం గ్రామాల్లో మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేతనాలిప్పించమని ఎమ్మెల్యేకి మొర


ఆస్పత్రిలో వేతనాలు ఇప్పించాలని ఎమ్మెల్యేకు విన్నవించుకుంటున్న పారిశుద్ధ్య కార్మికులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని సోమవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పర్యవేక్షించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో అందుతున్న సేవలను ఆరా తీశారు. ఈ సందర్భంగా రోగులు ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గత 4నెలలుగా వేతనాలు అందడంలేదని, పీఎఫ్ సైతం తమ బ్యాంక్ ఖాతాలకు జమకావడంలేదని పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, వైద్యులు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులకు టీకాలు వేయించాలి


గొర్రెలకు నట్టల నివారణ టీకాలు వేస్తున్న గ్రామ సర్పంచ్ బొనిగే పోతన

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పశువులు, జీవాలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులకు టీకాలు వేయించాలని పట్టింపాలెం సర్పంచ్ బొనిగే పోతన సూచించారు. సోమవారం మండలంలోని పట్టింపాలెం గ్రామ పశువైద్యశాల వద్ద మేకలు, గొర్రెలకు నట్టల నివారణ టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోతన మాట్లాడుతూ టీకాలు వేయడం ద్వారా పాడి పశువులు, జీవాల ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ అనిల్ మాట్లాడుతూ ఈ నెల 31వ తేది వరకు టీకాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులకు ఎద పరీక్షలు, చూడి కట్టని వాటికి చూడి పరీక్షలు, గర్భకోశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం గ్రామంలో 23 పశువులకు, 350 గొర్రెలకు నట్టల నివారణ టీకాలు వేశారు. కాగా, మంగళవారం వీరంపాలెం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


తణుకుఅర్బన్: వార్డుల్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరావు


తాడేపల్లిగూడెం(టీఓసీ): వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: స్వచ్ఛ ఆంధ్ర నినాదం సాకారం కావాలంటే ఇంటి నుంచే శుభ్రత, పరిశుభ్రత పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని కప్పల వెంకన్న సెంటర్‌లో దోమకాటు వ్యాధులపై అవగాహన, వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాక్టివిటీస్‌ను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించి మాట్లాడారు. డ్రెయిన్ డస్ట్ బిన్ కాదని ప్రతీ ఒక్కరూ గ్రహించాలని, డ్రెయిన్‌లలో చెత్త వేయవద్దని, చెత్తను డస్ట్ బిన్‌లో మాత్రమే వేయాలని అన్నారు. చెత్త సేకరణ సిబ్బందికి ఇంటి చెత్తను అందజేయాలని, మురుగునీరు పారుదలకు ఆటంకం కలిగించవద్దని, చిన్న చిన్న నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమ పుట్టుకకు చెక్ పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా వ్యాధుల నివారణకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టి.లక్ష్మి కాంతం, ఎస్.స్వర్ణ కుమారి, ఆశ కార్యకర్తలు కె.ఝాన్సీ, వి.భార్గవి పాల్గొన్నారు.

కీటక జనిత ప్రదేశాలను గుర్తించి నిలువరిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కీటక జనిత ప్రదేశాలను నిలువరించి మలేరియా, చికెన్ గునియా, బోదకాలు, మెదడువాపు వ్యాధుల వ్యాప్తిని అరికడదామని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పరిసరాల పరిశుభ్రత, సామాజిక బాధ్యత, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరుతూ పట్టణ ఆరోగ్య కేంద్రం ఎన్‌టీఆర్ జంక్షన్, కడకట్ల, యాగర్లపల్లి, వీకర్స్‌కాలనీ పరిధిలోని 22, 23, 24, 25 వార్డుల్లో సోమవారం వెక్టార్ కంట్రోల్ హైజీన్‌పై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. వార్డులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా చూడాలన్నారు. పొడివాతావరణం పాటించాలన్నారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయడం ద్వారా దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చునని పిలుపునిచ్చారు. పరిసరాలలో ఉండే తొట్లు, బానలు, డ్రమ్ములలో ఉన్న నిల్వ నీటిని తొలగించాలని, వాటిని శుభ్రపరిచి వాడుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ఆదిలక్ష్మి, జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది పాలొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

భీమవరం: సమస్యల పరిష్కారానికి రైతు సంఘాల నాయకుడు జగత్ సింగ్ దలైవాల్ 58 రోజులుగా ఢిల్లీలో చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. చింతకాయల బాబురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, కేంద్రం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని లేకుంటే అమరణ దీక్ష చేస్తున్న జగత్‌సింగ్ దలైవాల్ ప్రాణానికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని నిరసన


ఇరగవరం రోడ్డులో నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

తణుకు అర్బన్: తణుకు ఇరగవరం కాలనీ ప్రాంతంలోని 11, 12, 13 వార్డులకు సంబంధించి దళితుల శ్మశాన వాటికకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని తణుకు జైభీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఇరగవరం రోడ్డుపై టెంట్లువేసి బైఠాయించిన దళితనాయకులు తమకు ఉన్న శ్మశాన వాటిక సరిపోవడం లేదని, ఉన్న స్థలంలో కూడా పెరిగిన చెట్లు ప్రమాదకరంగా పడిపోయే స్థితిలో ఉన్నాయని మునిసిపల్ అధికారులకు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. శ్మశాన వాటిక ప్రాంతం సరిపోకపోవడంతో మిగిలి ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేసుకుంటే మునిసిపల్ అధికారులు ఆపివేశారని చెప్పారు. ఘటనా ప్రాంతానికి పట్టణ ఎస్సై శ్రీనివాస్ వచ్చి దళితనాయకులతో చర్చలు జరిపి విరమింపజేశారు.

24 నుంచి 26 వరకు బాలోత్సవం


తణుకులో బాలోత్సవం కరపత్రాలను ఆవిష్కరించిన కమిటీ నాయకులు

తణుకు అర్బన్: ఈనెల 24 నుంచి 26 తేదీ వరకు తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న బాలోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దక్షిణామూర్తి విజ్ఞప్తి చేశారు. సోమవారం తణుకులో వివిధ పాఠశాలల్లో యాజమాన్యాలకు బాలోత్సవ కార్యక్రమ కరపత్రాల పంపిణీలో ఆయన మాట్లాడారు. 40కి పైగా అంశాల్లో నిర్వహించే ప్రతిభా ప్రదర్శన పోటీల్లో రెండు వేలకుపైగా వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. కమిటీ అధ్యక్షుడు పీఎల్ నరసింహారావు మాట్లాడుతూ బాలోత్సవం పేరుతో నిర్వహించే పిల్లల సంబరాలను పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, పురప్రముఖులు, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కోశాధికారి ఏఎస్‌వీ శేషుబాబు, సభ్యులు పాల్గొన్నారు.

భూసమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో రీ–సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నవాబుపాలెం గ్రామంలో 690ఎకరాలు భూసర్వేను నాలుగు నెలల పాటు సర్వే బృందాలు సర్వే చేస్తాయన్నారు. సర్వేలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే మరో మొబైల్ బృందం శాశ్వత పరిష్కారానికి చొరవ తీసుకుంటుందన్నారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులంతా గ్రామంలో ముందస్తుగా రైతులకు నోటీసులు ఇచ్చి సర్వే చేపడతారన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆళ్వార్‌దాసు చిరస్మరణీయులు


ఆళ్వార్‌దాసు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వాకర్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆళ్వార్‌దాసు చిరస్మరణీయులని ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమళ్ల సూరిబాబు పేర్కొన్నారు. వాకర్స్ భవనంలో సోమవారం వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర ఆళ్వార్ దాస్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వాకింగ్ అలవాటును ప్రోత్సహించి, అసోసియేషన్ ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించిన చిరస్మరణీయులు ఆళ్వార్‌దాసు అన్నారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అల్లూరి శ్రీనివాస్, కోశాధికారి మల్లారెడ్డి సారధి, పూర్వ అధ్యక్షులు దూలం నాగరాజు, బాకా వెంకటేశ్వరరావు, కేవీ చలం, రాగిరెడ్డి నాగ వరప్రసాద్, వనచర్ల నాగేంద్ర ప్రసాద్, ఏఆర్‌కే సత్యనారాయణ మూర్తి, గ్రంధి సత్యనారాయణ, దూలం సత్యనారాయణ గణపతిరాజు, గురుమూర్తి, దత్తాత్రేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చేసే డ్రైవింగ్ సురక్షితం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాస్

తణుకు అర్బన్: నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని తణుకు మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఏకాగ్రతతో చేసే డ్రైవింగ్ సురక్షితమని తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని స్పష్టం చేశారు. డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని వాహనాన్ని నడపాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పిల్లలకు ఉత్తేజాన్ని నింపుతున్న సహిత క్లబ్స్


సహిత క్లబ్‌లో ఆటలు ఆడుతున్న దివ్యాంగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సహిత క్లబ్స్ దివ్యాంగుల పిల్లలకు ఉత్తేజాన్ని నింపుతున్నాయని భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య అన్నారు. భవిత సెంటర్‌లో సోమవారం దివ్యాంగుల పిల్లలకు, నార్మల్ పిల్లలకు కలిపి డాన్సులు, వివిధ రకాల ఆటల పోటీలు జరిగాయి. బాలీశ్వరయ్య మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు వారి తల్లిదండ్రులకు మనోధైర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయిని కె.కుమారి, అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, నాగలక్ష్మి, రత్నకుమారి, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు అత్తిలిలో ఉచిత కంటి పరీక్షా శిబిరం

అత్తిలి: లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి భవనంలో మంగళవారం రాజమండ్రి రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాలండర్ ఆఫ్ ఈవెంట్స్ డీసీ యాతం రాంబాబు తెలిపారు. శిబిరంలో ఐఓఎల్ ఆపరేషన్లు, క్రిటికల్ కంటి సమస్యలకు డయాబెటిక్ లేజర్ చికిత్స ద్వారా పరిష్కారం అందజేస్తారని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.